
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

ఆదివారం 7 జూలై 2024

కష్టాల కడలిలో కార్యదర్శులు



ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ పంచాయతీలు

- జీపీ కార్మికులకు అందని వేతనాలు
- నిధులు లేక సొంత డబ్బులు వెచ్చిస్తున్న వైనం
- సర్వేల పేరిట అదనపు భారం
- పాలకవర్గాలు లేవు.. ప్రత్యేకాధికారులు పట్టించుకోరు
- జిల్లాలో 265 మంది సెక్రెటరీలు

రఘునాథపల్లి, జూలై 6: గ్రామ కార్యదర్శులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమయానికి నిధులు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామ పంచాయతీలలో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే అయిదు నెలలుగా ట్రాక్టర్ డీజిల్‌తో పాటు ఇతరత్రా మరమ్మతుల కోసం సొంత డబ్బులను వెచ్చిస్తున్నారు. దీనికి తోడు అధికారులు అప్పగిస్తున్న పలు సర్వేలతో ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్మికులకు కొద్ది నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారిని సముదాయించి పని చేయించడానికి కార్యదర్శులు పడుతున్న కష్టాలు అన్నీ..ఇన్నీ కావు..

గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి అయిదు నెలలు గడచిపోయింది. ప్రత్యేకాధికారులు ఉన్నా లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు 5 నెలల నుంచి, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 24 నెలల నుంచి పంచాయతీలకు రావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాభివృద్ధిలో ప్రముఖ భూమిక పోషించే పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు ఉండగా 265 మంది కార్యదర్శులు ఉన్నారు. మిగతా స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గతంలో గ్రామాల అభివృద్ధి పనులతో పాటు మరమ్మతులు తదితర వ్యవహారమంతా సర్పంచ్‌లు, పాలకవర్గాలు చూసుకునేది.. గత ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియగా, ఆ వెంటనే ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించింది. ఇతర శాఖలో కీలకంగా ఉన్న గెజిటెడ్ అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలపై సరైన దృష్టి సారించలేకపోతున్నారు. తమ మాతృ శాఖలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఎప్పుడో ఒక సారి గ్రామాలకు వెళ్తు సలహాలు, సూచనలకు మాత్రమే పరిమితమవుతున్నారు.

సర్వేల నుంచి మినహాయించాలి..

- కనకం విజయ్ కుమార్, టీపీఎస్ఎఫ్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేల నుంచి పంచాయతీ కార్యదర్శులను మినహాయించాలి. ఇప్పటికే పంచాయతీ పాలన భారం మోయలేక పోతున్నాం. ప్రత్యేకాధికారులు సలహాలు, సూచనలకే పరిమితం అవుతున్నారు. దీంతో గ్రామాలలో అత్యవసర పనుల కోసం సొంత డబ్బులను ఖర్చుపెడుతున్నాం. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి మా పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. పంచాయతీ రాజ్ శాఖ పనులే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన పనులను సైతం మాతో చేయించడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మాపై పని భారం తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

అంతా తామై..

పంచాయతీ పాలన భారం అంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మరమ్మతు పనుల నిర్వహణ బాధ్యత, సిబ్బంది జీతభత్యాలు, పన్నుల వసూళ్లు, ఆదాయ, వ్యయం లావాదేవీలు, నెలవారి చెల్లింపులు తదితర విషయాలన్నీ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మరీ అప్పులు చేసి జీపీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కార్యదర్శులు వాపోతున్నారు.

నిలిచిపోయిన నిధులు..

గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు నిలిచిపోయాయి. ట్రాక్టర్‌కు అవసరమైన డీజిల్‌తో పాటు పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్య నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్లు, చెత్త దంపింగ్ యార్డులు, శ్మశానవాటిక నిర్వహణ, వాటర్ ట్యాంక్‌ల క్లోరినేషన్ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు 5 నెలల నుంచి, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 24 నెలల నుంచి పంచాయతీలకు రావడం లేదు. దీంతో గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధుల కొరత ఏర్పడింది. జీపీ కార్మికుల జీతాలు ఇవ్వలేక, ట్రాక్టర్ల నెలవారీ కిస్తీలు కట్టలేక కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వసూలైన పన్నులు, ఇతరత్రా ఆదాయం సాధారణ ఖర్చులకే సరిపోవడం లేదు. ఏదైనా మరమ్మతులు, అత్యవసర అవసరాలకు పంచాయతీ కార్యదర్శులే తమ జేబులో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు పాలకవర్గాలు లేక, నిధులు రాక, అటు ప్రత్యేకాధికారులు పట్టించుకోక అడకత్తెరలో పోకచెక్కలా కార్యదర్శులు నలిగిపోతున్నారు.



రఘునాథపల్లి జీపీ కార్యాలయం

సర్వేలతో సతమతం

మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందాన పంచాయతీల పాలనతోనే అష్టకష్టాలు పడుతున్న పంచాయతీ కార్యదర్శులపై సర్వేల భారం మోపుతున్నారు. దీంతో వారు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. తమ శాఖలకు సంబంధం లేని సర్వేలను అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటా మిషన్ భగీరథ నల్లాల వివరాలను నమోదు చేసే విషయంలో కార్యదర్శులే కీలకంగా వ్యవహరించారు.

అభిషేక భద్రకాళి

కన్నులపండువగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు కామేశ్వరిగా అమ్మవారి దర్శనం



తొలిరోజు కామేశ్వరి అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 6: అమ్మవారి శరణుఘోషతో భద్రకాళి ఆలయ పరిసరాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు.. అభిషేకాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వరంగల్ భద్రకాళి అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆషాఢ మాసం తొలి రోజు పాడ్యమి సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా షురూ అయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఉత్సవాల ప్రారంభాన్ని ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అమ్మవారికి సహస్ర వేయి కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. అలాగే సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, పసుపు, కుంకుమ, గంధం, చందనం, పండ్ల రసాలతో అమ్మవారికి కన్నుల పండువగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకరణ, అర్చన నిర్వహించారు. తొలిరోజు కామేశ్వరి మాతగా అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు.

దేవరుప్పుల ప్రథమ సర్పంచ్ కాసాని ఎర్రయ్య యాదవ్ కన్నుమూత



కె. ఎర్రయ్య (ఫైల్)

దేవరుప్పుల/జనగామ రూరల్, జూలై 6: దేవరుప్పుల ప్రథమ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక వృద్ధుడు కాసాని ఎర్రయ్య యాదవ్(101) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం కన్నుమూశారు. కొన్ని సంవత్సరాలుగా జనగామ పట్టణంలోని ఆయన కుమారుడు నరేందర్ ఇంట్లో ఉంటున్న ఆయన భార్య ముత్యాలమ్మ గత ఏడాది మృతి చెందారు. ఎర్రయ్య మృతి పట్ల దేవరుప్పుల మాజీ సర్పంచ్ ఈదునూరి రమాదేవి నర్సింహారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదేళ్లు సర్పంచ్‌గా పని చేసి ఆయన దేవరుప్పులను ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఎర్రయ్య యుక్తవయస్సులోనే ఎర్రజెండా చేతబట్టి అలుపెరుగని పోరాటం చేశారని, విస్నూరు దేశ్‌ముఖ్ గుండాలను ఎదురించి పోరాడాడని గుర్తు చేశారు. ప్రజల పక్షాన నిలబడి యువకులను చైతన్యవంతం చేశారని అన్నారు. అదే విధంగా ఎర్రయ్య తండ్రి కొండయ్యను ఆనాడు దేశ్‌ముఖ్ గుండాలు సజీవ దహనం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నీలారపు వేణు యాదవ్, వెంకన్న యాదవ్, ఎర్రయ్య యాదవ్‌తో పాటు పలువురు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎర్రయ్య మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు వంగాల మల్లారెడ్డి, కౌన్సిలర్ వంగాల కళ్యాణి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ నాయక్ సందర్శించి నివాళులర్పించారు.

డాక్టర్లు డ్యూటీలో లేకపోతే ఎలా?

ఏరియా ఆస్పత్రి వైద్యులపై డీఎంఈ అసహనం



జనగామ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంఈ డాక్టర్ వాణి

జనగామ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జనగామ ఏరియా ఆస్పత్రి వైద్యులు విధులకు హాజరు కాకపోవడంపై తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ ఎన్.వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీక్షా సమావేశానికి హైదరాబాద్ నుంచి వెళ్తూ జనగామ ఏరియా ఆస్పత్రిని శనివారం మధ్యాహ్నం ఆయన తనిఖీ చేశారు. అంతకుముందే కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించి వెళ్లిన గంటకే డీఎంఈ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వైద్యులు ఖంగుతిన్నారు. ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆమె వైద్యుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వైద్యులు విధుల్లో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు విధుల్లో లేకపోతే ప్రజలకు సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. అనంతరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు ఛాంబర్‌లో వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

జనగామ రూరల్, జూలై6: జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేసి వైద్యుల పనితీరును పర్యవేక్షించారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బంది హాజరు తక్కువగా ఉండటంతో కారణాలు తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. రోగులు కూర్చునేందుకు మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, సీటీస్కాన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ అత్యంత అవసరమని, వాటర్‌ప్లాంట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



జనగామ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

రుణాలు రికవరీ చేయండి

డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరగాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 6: పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరగా రికవరీ చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. కర్షకమిత్ర, ఎల్‌టీ, డెయిరీ, మార్టిగేజ్ తదితర రుణాలను రికవరీ చేయాలన్నారు. రికవరీకాని రుణాల విషయంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాలు పొందేవారి చేత రూ.2లక్షల పీఎంజేజేవై, పీయంఎస్‌బీవై చేయించాలన్నారు. బ్యాంకు డిపాజిట్ల పెరుగుదలపై దృష్టి పెట్టాలని ఈ మేరకు బ్యాంకు కల్పిస్తున్న వడ్డీలు ఇతర ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డిది తుగ్లక్ పాలన

- దమ్ముంటే కడియం రాజీనామా చేసి గెలవాలి
- బీఆర్ఎస్ కార్యాలయాల జోలికి వస్తే యుద్ధమే
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 6: రాజముద్రను, రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తూ సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనను తలపిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎద్దేవా చేశారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగిన తరువాత రూపొందించిన చిహ్నాలను, రాజముద్రను, వివిధ సంక్షేమ పథకాల లోగోలను, వాటి పేర్లను మార్చాలని చూడడం దుర్మార్గం అన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ ఇలాంటి దుశ్చర్యలకు ఎవరూ పాల్పడలేదన్నారు. ఇలాంటి మార్పులు చేయడానికే సీఎం రేవంత్ ప్రభుత్వం రూ.5640 కోట్లు వినియోగించడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు, తెలంగాణ తల్లి విగ్రహాలను తొలగించాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని, వాటి జోలికి వస్తే రాష్ట్రంలో యుద్ధ వాతవరణం నెలకొనడం ఖాయమని హెచ్చరించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవుపలికారు. కాంగ్రెస్ ఏడు నెలల పాలనలో పల్లెప్రగతి, పట్టణప్రగతిని పట్టించుకున్న నాధుడే లేడన్నారు. ఎమ్మెల్యే కడియం పేరును ఉచ్చరించాలంటే సిగ్గేస్తోందని.. నీతికి, నిజాయితీకి మారుపేరు అని చెప్పుకునే ఆయన దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేతి గుర్తుపై గెలువాలని సవాల్ చేశారు. కడియం గ్రామాల్లో పర్యటిస్తే తరిమికొట్టాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో నాయకులు ఆకుల కుమార్, పసునూరి మహేందర్ రెడ్డి, కనకం గణేష్, లకావత్ చిరంజీవి, తాటికొండ సురేష్‌కుమార్, సోమిరెడ్డి, ఊడుగుల భాగ్యలక్ష్మి, చింత శ్రీనివాస్, మారపల్లి ప్రసాద్, దేవయ్య, ఆకారపు అశోక్, గాదె రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూలై 6: రాష్ట్రంలోని అల్పసంఖ్యాక వర్గాల వారు విదేశాలలో పైచదువుల నిమిత్తం 'ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి బి.రవీందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. అమెరికా, న్యూజిలాండ్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, కెనడా, లండన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలకు వెళ్లే వారు దీనికి అర్హులన్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థికి స్కాలర్‌షిప్/ఆర్థికసాయం కింద రూ.20 లక్షలు రెండు విడతలలో చెల్లిస్తారని, విమాన ప్రయాణ చార్జీల నిమిత్తం మరో రూ.60 వేలు చెల్లిస్తారని అన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఆగస్టు 7 వరకు తెలంగాణ ఈపాస్ డాట్ సీజీజీ డాట్ గవ్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి జతపరిచిన రెండు సెట్ల దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయంలో ఆగస్టు 27 లోగా అందజేయాలన్నారు. వివరాలకు 99519 33034 నంబరులో సంప్రదించాలన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు అర్థరహితం

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

జనగామ రూరల్, జూలై6: హిందువులు హింసావాదులని.. ముస్లింలు, క్రైస్తవులు అహింసావాదులని పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలు అర్థరహితమని, ఆయనకు పాకిస్తాన్‌లో ఉన్న జిన్నా కంటే ఎక్కువ హిందువులపై ద్వేషం ఉందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కావాలి తప్ప వాటిపై మోదీ బొమ్మ పెట్టడం ఇష్టం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతీ సంక్షేమ పథకానికి మోదీ బొమ్మ పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ పుంజుకునే వరకు ఎల్ఆరెస్ అమలు చేయకుండా చార్జీలు పెంచితే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన కృషితో ఆర్టికల్ 370ని రద్దు చేశామన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుడు ప్రచారం వల్ల బీజేపీకి కొన్ని సీట్లు తగ్గాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏఒక్కటీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి, పాపారావు, ఉడుగుల రమేష్, సౌడ రమేష్, కొంతం శ్రీనివాస్, ఉమారాణి, పిట్టల సత్యం, పవన్ శర్మ, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్య గౌడ్

మూడు రోజులుగా ఆగిపోయిన రిజిస్ట్రేషన్లు

ఆందోళనకు దిగిన బాధితులు



ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

జనగామ రూరల్, జూలై 6: జనగామ తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజుల నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో జనగామ రియల్ ఎస్టేట్ జిల్లా కార్యదర్శి తొట్టె కృష్ణ ఆధ్వర్యంలో బాధితులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్లు కావడంలేదని, ఎందుకు రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయో కార్యాలయ సిబ్బంది సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై తహసీల్దార్ గుగులోత్ వెంకన్నను వివరణ కోరగా జనగామ ఆర్డీవో కార్యాలయంలో ఆపరేటర్లు ధరణి పనులు చేస్తున్నందున ఆలస్యం అయిందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

విద్యుత్ కార్యాలయాల్లో కన్జ్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లు

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 6: వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఎస్ఈ కార్యాలయం నుంచి మొదలు సెక్షన్ ఆఫీసుల వరకు కన్జ్యూమర్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ శుక్రవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. రిసెప్షన్ డెస్క్‌ల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయడానికి వీలుంటుందని, ఫిర్యాదులను విశ్లేషణ చేసుకోవచ్చన్నారు. ఒక వేళ ఫిర్యాదుపై వినియోగదారుడు సంతృప్తి చెందకపోతే ఫిర్యాదు పునరావృతం అవుతుందన్నారు. ఫిర్యాదులను సంబంధిత ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు పర్యవేక్షిస్తారన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొట్టమొదటిసారిగా విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ముద్రించి వచ్చే నెల నుంచి అందిస్తామన్నారు. ఇప్పటికే వరంగల్ సర్కిల్ పరిధిలో మట్టెవాడ సెక్షన్, హనుమకొండ, భూపాలపల్లి, ఏజే మిల్స్, ఈఆర్‌ఓలలో ముద్రించి ఇస్తున్నట్లు తెలిపారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్, అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు అధికారి నుంచి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలన్నారు. విద్యుత్ సర్వీసుల మంజూరును ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణతో పాటు ఇతర అన్ని రకాల నిర్వహణను యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెకర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు రాజుచౌహాన్, తిరుమల్‌రావు, కె.ఎన్.గుట్ట, కె.కిషన్ జీఎంలు గౌతమ్‌రెడ్డి, దేవేందర్, కృష్ణమోహన్, మల్లిఖార్జున్, నాగప్రసాద్, శ్రీనువాస్, శేషారావు, డీఈ ఐటీ. అనిల్‌కుమార్, డీఈ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ యూత్ నాయకుడిపై కేసు

వరంగల్ క్రైం, జూలై 6: ఒకరిపై దాడి కేసులో 55వ డివిజన్ టీఆర్ఎస్ యూత్ నాయకుడు జి.సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు కేయూ ఎస్ఐ సురేష్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ జంక్షన్ సమీపంలోని బెల్టుషాపు నిర్వాహకుడి వంశీపై సాయి దాడి చేసి కొట్టాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఎంజీఎంలో ఒకే ఒక డెంటిస్టు

వైద్యుల కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు ● నియమించాలని డిమాండ్

వరంగల్ మెడికల్, జూలై 6: ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రిలో దంత వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో రోగులు వస్తున్నా.. ఒకే ఒక్క దంత వైద్యుడు తన పరిధిలో సేవలందిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఆ వైద్యుడిపై అధిక భారం పడుతోంది. ఒకవేళ ఆయన సెలవు పెట్టాండంటే అంతే సంగతులు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దంత రోగులు వెనుతిరగాల్సిందే.

రెగ్యులర్ వైద్యుడికి ఫారీన్ సర్వీస్

ఈ విభాగంలో హెచ్‌ఓడీగా పని చేస్తున్న ప్రొఫెసర్ ఆరేళ్ల కిందట కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిగా ఫారిన్ సర్వీస్‌లోకి వెళ్లారు. అప్పట్లో ఎంజీఎం అధికారులు కూడా ఉన్న ఒక్క ప్రొఫెసర్‌ను వదులుకునేందుకు ఎన్‌ఓసీ ఎందుకు ఇచ్చారో ఇంత వరకు ఎవరికీ అర్థం కావడం లేదు. మొత్తానికి సదరు వైద్యుడు ఫారిన్ సర్వీస్‌లో స్థిరపడిపోయాడు. ఇక మిగిలిన ఒకే ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండేళ్ల కిందట అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై వెళ్లిపోయాడు. ఇక ఎంజీఎంలో దంత వైద్య విభాగం వైద్యులు లేని దుస్థితి నెలకొంది. దీంతో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై ఓ వైద్యుడిని నియమించారు. ఆ వైద్యుడే రోజు 200 వరకు ఓపీ చూస్తూ విభాగాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకవేళ ఆయన సెలవు పెడితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వెనుతిరిగిపోవాల్సిందే.

ఎన్ఎంసీ ఆక్షేపణ

దంత వైద్య విభాగంలో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేరని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆక్షేపణ వ్యక్తం చేస్తూ తాజాగా లేఖను పంపింది. దంత వైద్య విభాగంలో పీజీలు ఎస్ఆర్‌లు కూడా ఉండకపోవడంతో ఒకే ఒక వైద్యుడిపై భారం పడుతోందని ఎన్ఎంసీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.





ఎంజీఎంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

దరఖాస్తులకు మోక్షం ఎప్పుడో?

కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వర్తించేందుకు ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తు స్వీకరించి నెలలు గడుస్తున్నా కనీసం పరిశీలనకు నోచుకోనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా కేఎంసీ అధికారులు పేద రోగుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

సంఖ్యను పెంచాలి

పేదల ఆస్పత్రిలో దంత వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో ఒకే ఒక వైద్యుడు ఉండటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్, డీఎంఈ, జిల్లా మంత్రులు స్పందించాలని రోగులు కోరుతున్నారు.

రూ.100కోట్లతో పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, జూలై 6: ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా వరంగల్‌లోని భద్రకాళి ఆలయాన్ని రూ.100కోట్లతో అభివృద్ధి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మాఢవీధులు, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30కోట్ల నిధులు ఇవ్వగా, మరో రూ.70 కోట్లు నిధులు వెచ్చించి రూ.100 కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. వరంగల్ నగరాన్ని మెడికల్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ రెండు రోజుల్లో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్, ఎన్ఆర్ఐలు కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, కీర్తి, ప్రముఖ పారిశ్రామిక వేత్త బాసని విశ్వప్రసాద్ శోభ, ప్రముఖ వైద్యుడు పోతాని రాజేశ్వరప్రసాద్, డాక్టర్ లలితాదేవితో పాటు వ్యాపారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో శేషభారతి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తి

దంతాలపల్లి రోడ్డు ప్రమాద మృతులకు పూర్తయిన దహనసంస్కారాలు

కన్నీరుమున్నీరైన గ్రామస్థులు, బంధువులు.. విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి, జూలై 6: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై శక్రవారం రాత్రి దంతాలపల్లి మండలకేంద్రం శివారు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన ఆటో - కారు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు శనివారం రాత్రి పూర్తయ్యాయి. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పగిండ్ల కొమురయ్య, వాల్యా తండాకు చెందిన భూక్య నరేష్‌తో పాటు తొర్రూరు మండలం వెలికట్టకు చెందిన ఆటోడ్రైవర్ బందు మల్లేష్‌కు వారి వారి గ్రామాల్లో బంధువుల రోదనల నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. కాగా, మృతుడు పగిండ్ల కొమురయ్యకు కూతురు హారతి తల కొరవి పెట్టింది. మృతుడు నరేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు మృతదేహాలను సందర్శించి సంతాపాన్ని ప్రకటించారు.



ఇంటి ఎదుట కొమరయ్య మృతదేహంను చూసి రోదిస్తున్న బంధువులు

కారు సీజ్ - డ్రైవర్‌పై కేసు

దంతాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురిని బలిగొన్న కారును పోలీసులు శనివారం సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. దంతాలపల్లి మండలంలోని రామానుజపురానికి చెందిన బొడ్డు సురేందర్.. ఖమ్మం నుంచి వస్తూ.. దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ శివారులో తొర్రూరు నుంచి వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న పగిండ్ల కొమురయ్య, భూక్య నరేష్, ఆటో డ్రైవర్ బందు మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన బొడ్డు సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ వెల్లడించారు.

విషమంగానే క్షతగాత్రులు

దంతాలపల్లి మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడిన తల్లీకూతుళ్ల పగిండ్ల మంజుల, పగిండ్ల అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ పేర్కొన్నారు. బీరిశెట్టిగూడెంకు చెందిన మృతుడు పగిండ్ల కొమురయ్య, ఆయన సతీమణి పగిండ్ల మంజుల, కుమార్తె అంజలి, బావమరిది కుమార్తె అక్కన్నపల్లి అక్షయ మహబూబాబాద్ మండలం అమనగల్ నుంచి శుక్రవారం రాత్రి బీరిశెట్టిగూడెంకు ఆటోలో బయలు దేరారు. ఈ క్రమంలో దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మంజుల, అంజలి, అక్షయ తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంజుల, అంజలి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, జూలై 6: కేయూ డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం విడుదల చేశారు. వివిధ కోర్సుల్లో 46,139 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 23,114 మంది 50.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు.



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

ట్రాఫిక్ స్తంభాలకు కేబుల్ వైర్లను తొలగించాలి..

వరంగల్ క్రైం, జులై 6: మూడు రోజుల్లో ట్రైసిటీ పరిధిలో ఉన్న ట్రాఫిక్ స్తంభాలకు ఉన్న కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కేబుల్ వైర్లను తొలగించాలని పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైసిటీ పరిధిలో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా, పాత సిగ్నల్స్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలన్నారు. మూడు రోజుల్లో తొలగించకుంటే మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని కమిషనరేట్ అధికారులు తెలిపారు.

నేడు 'రణధీర సీతక్క' పుస్తక ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జూలై 6: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జీవన ప్రస్థానంపై ప్రముఖ రచయిత ఆస్నాల శ్రీనివాస్ రాసిన 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ సభను ఈ నెల 7వ తేదీన జిల్లా పరిషత్ హాలులో నిర్వహిస్తున్నట్లు దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ప్రతినిధులు రాములు, బిల్లా మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఆ పోరాట అమరుల స్మరణలో పుస్తక సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఎంపీ కడియం కావ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ బుర్ర రమేశ్‌బాబు కీలకోపన్యాసం చేస్తారు. కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట జంక్షన్, జూలై 6: రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, మెరుగు హనుమారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, ఆపై చదువులు చదివే బాలికలు ఈ నెల 25లోపు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు బాలికతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరైనా ఒకరు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. దరఖాస్తులను హనుమకొండ కనకదుర్గాకాలనీలోని రోడ్ నంబర్1లో గల హాస్టల్‌లో వార్డెన్ శోభారెడ్డికి అందించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9676649811లో సంప్రదించాలని కోరారు.

తనిఖీల్లో తకరారు!





- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనాలు స్టాండ్స్‌కు తరలింపు
- అధిక డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- స్టాండ్ నిర్వాహకులు, పోలీసులకు మధ్య ఒప్పందం

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలను అరికట్టాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తనిఖీలు నిర్వహించాలని చెబుతుంటే.. కొంతమంది పోలీసు అధికారులు దాన్ని ఆసరాగా తీసుకొని డబ్బులు దండుకుంటున్నారు. ఆర్టీసీ స్కూటర్ పార్కింగ్, బస్టాండ్ చుట్టూరా ఉన్న పార్కింగ్ కేంద్రం నిర్వాహకులతో ముందే ఒప్పందం కుదుర్చుకుని వాహనదారుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. రోజుకిన్ని వాహనాలను పార్కింగ్ కేంద్రాలకు తరలించాలని లక్ష్యం పెట్టుకుని మరీ వాహనాలను స్కూటర్ స్టాండ్‌కు తరలిస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో రాత్రి పూట మద్యంషాపులతో పాటు, నగర శివారు భీమారం, ఎర్రగట్టు గుట్ట ఏరియాలో వాహన తనిఖీలను చేపట్టి వాహనాలను స్వాధీనం చేసుకొని పార్కింగ్ కేంద్రాలకు తరలిస్తూ వాహనదారుల జేబులకు చిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హనుమకొండ టౌన్, జూలై 6 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారుల నుంచి పార్కింగ్ పేరిట ఆయా స్కూటర్ స్టాండ్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వసూళ్లలో కొంత ట్రాఫిక్ పోలీసులకు ముడుతుందనే ఆరోపణలున్నాయి. స్టాండ్ నిర్వాహకులతో ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. ముఖ్యంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

వాహనం పట్టుబడితే అంతే..

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారుడికి వాహనం ఇచ్చేది లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతుంటారు. మత్తులో ఉన్న వ్యక్తికి వాహనం ఇచ్చి ప్రమాదాలను పెంచాలా..? అని ప్రశ్నిస్తుంటారు. అయితే వాహనదారుల వెంట వచ్చిన సంబంధీకులకు వాహనాలు ఎందుకు ఇవ్వరనే ప్రశ్నకు సమాధానాలు చెప్పరు. అయితే వాహనాలను నగరంలోని పార్కింగ్ కేంద్రాలకు తరలించి భారాన్ని మోపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరపరిచి తీర్పు వెల్లడించే వరకు ఆ వాహనం పార్కింగ్ కేంద్రాల్లోనే ఉంటుంది. ఈ లోపు నిర్వాహకులు వారి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు కోర్టులో చెల్లించే జరిమానా కంటే పార్కింగ్‌కు చెల్లించే డబ్బులే తడిసి మోపడవుతున్నాయని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యం

హనుమకొండ ట్రాఫిక్‌లో పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ఓ ఆర్ఎస్ఐ హోంగార్డులపై ఒత్తిడి తెస్తూ భారీ లోడుతో వచ్చే వాహనాలతో పాటు కొంత మంది వ్యాపారస్థుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్ అధికారి మాత్రం చూసీచూడనట్లుగా ఉండడంతో ఆ ఆర్ఎస్ఐ ఆడిందే ఆటగా నడుస్తోందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సీపీ దృష్టిసారించి ట్రాఫిక్ పోలీసుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు వ్యాపారస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగి చిక్కితే పండగే..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రభుత్వ ఉద్యోగి పట్టుబడితే ట్రాఫిక్ సిబ్బందికి పండపండినట్లే.. కేసులో ఇరుక్కుంటే ఉద్యోగం పోతుందనే బెదిరింపులకు పాల్పడి అందినకాడికి దండుకుంటున్నారని విమర్శలున్నాయి. అలాగే కొద్ది రోజులు కిందట ఒక వ్యక్తికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తే ఆల్కహాల్ పర్సంటేజీ రాలేదు. దీంతో బండి కాగితాలు చూపించాలని మరో మెలిక పెట్టగా వాహనదారుడు చూపించకపోవడంతో బండిని పార్కింగ్‌కు తరలించారు. 24 గంటల్లో రూ.250 చెల్లించి బాధితుడు తన వాహనాన్ని తెచ్చుకున్నాడు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెల రోజులకు ముందు ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా పోలీసులు రైల్వే స్కూటర్ స్టాండ్‌కు వాహనాన్ని తరలించారు. ఆ వ్యక్తి 20 రోజుల తర్వాత వాహనం కోసం వెళ్లగా వేలల్లో డబ్బులు అడగగా వాహనాన్ని అక్కడే వదిలేసినట్లుగా సమాచారం.

బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్మ

కొత్తగూడ, జూలై 6: రోడ్డుపై వెళుతున్న వృద్ధురాలిని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలప్రకారం.. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన వెలుదండి నీలమ్మ రోడ్డుపై నడుస్తుండగా వెనకాల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొట్టాడు. దీంతో నీలమ్మ కుడి కాలు విరిగింది. తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అదించగా, హనుమకొండలోని ప్రయివేటు ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://iti.telangana.gov.in అనే వెబ్ పోర్టల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థినికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ బి. ప్రభాకర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 6: ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, కేడీసీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ హెల్ప్‌లైన కేంద్రాల్లో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించి సంబంధించిన ధ్రువపత్రాలను విద్యార్థులకు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయగా, ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జోతి విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు.

గుట్కా పట్టుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, జులై 6: వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో రూ.33వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలో కె.సురేష్ అనే వ్యక్తి నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ విషయాన్ని సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

వెహికిల్ షెడ్డులో రచ్చ.. రచ్చ..

మెకానిక్‌కు, సూపర్‌వైజర్‌కు మధ్య గొడవ ● అధికారులకు ఇరువర్గాల ఫిర్యాదు

వరంగల్ కార్పొరేషన్, జూలై 6: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ షెడ్డులో జరిగిన గొడవ రచ్చకెక్కింది. శనివారం షెడ్డులో అక్కడి మెకానిక్‌లకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మధ్య జరిగిన గొడవ రచ్చరచ్చగా మారింది. షెడ్డులో పెద్దఎత్తున గొడవ జరగడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఈ క్రమంలో కొంతసేపు మెకానిక్‌లు పనులు మానేసి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే..

బాలసముద్రంలోని బల్దియా వాహనాల మరమ్మతు కేంద్రంలో ముగ్గురు మెకానిక్‌లతో పాటు ఇద్దరు పంక్చర్లు అతికించే సిబ్బంది పనిచేస్తారు. అయితే ఇటీవల షెడ్డులో జరుగుతున్న దొంగతనాలపై అక్కడ పని చేసే సిబ్బందిని గుర్తించిన అధికారులు.. వారిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. అయితే బల్దియా కార్యాలయంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని బల్దియా షెడ్డులో నియమించారు. అందులో సదానందం అనే ఓవర్ స్టోరేజీ డ్రైవర్‌ను ఇక్కడ నియమించారు. ఈయన షెడ్డు ఇన్‌చార్జి అధికారులైన ఈఈ, డీఈల సహకారంతో షెడ్డు సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. దీంతో సదానందం అక్కడ పని చేసే మెకానిక్‌లు, సహాయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిపై అజామాయిషీ చెలాయిస్తున్నాడు. ఇది సహించలేని మున్నా అనే మెకానిక్ శనివారం తిరగబడ్డాడు. దీంతో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున గొడవ చోటు చేసుకుంది. ఒకరిని ఒకరు నెట్టి వేసుకున్నారు. అక్కడి సిబ్బంది కలుగ జేసుకుని సదానందం, మున్నాలను విడిపించారు. అక్కడి వారు వీరి గొడవను వీడియో తీసి వైరల్ చేశారు. ఇరువర్గాలు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. బల్దియా షెడ్డులో జరిగిన గొడవపై అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు

భీమారం, జూలై 6: విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.తిరుమల్‌రావు అన్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూషన్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం డాక్టర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఫార్మసీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరిశ్రమలోని నిపుణులతో మమేకమై వారి అనుభవంతో కెరీర్ పరంగా ముందుండాలని సూచించారు. ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి కార్యక్రమాలు తరుచూ నిర్వహిస్తాయని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. మల్టీనేషనల్ కంపెనీ అసోసియేట్ డైరెక్టర్ గణేష్ రమేశ్ ప్రొఫెషనల్ కెరీర్‌ల కోసం రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం గురించి వివరించారు. వివిధ పారిశ్రామిక రంగాల్లో తాజా సాంకేతిక పరిణామాలపై కూడా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన డైరెక్టర్లు హరిప్రశాంత్, సూరజ్ శర్మ, ఆదిత్య కుమార్, నీరజా కేసరి, వైష్ణవి, ప్రముఖ కంపెనీల డైరెక్టర్లు, ఎండీలు పాల్గొన్నారు.

ఫీటల్ మెడిసిన్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శిరీషరెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 6: అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతి ద్వారా గర్భిణికి కోరియాంజియోమ అనే కణతికి రాష్ట్రంలోనే తొలిసారిగా చికిత్స అందించి తల్లి, బిడ్డ ప్రాణాలను కాపాడినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీషరెడ్డి తెలిపారు. ఈ తరహాలో చికిత్స భారత దేశంలో మూడోదని, రాష్ట్రంలోనే తొలిసారి హనుమకొండలో నిర్వహించినట్లు తెలిపారు. వరంగల్ రంగశాయిపేటకు చెందిన వేమునూరి హారిక 27 వారాల గర్భవతి. కడుపునొప్పితో గైనకాలజిస్టు డాక్టర్ వరలక్ష్మీని సంప్రదించిందని, అయితే స్కానింగ్ కోసం తమ వద్దకు పంపగా సుమారు 10 సెం.మీ. కణతి గర్భం దగ్గరలో ఉందని, దీనివల్ల గర్భంలో ఉన్న శిశువుకు రక్తం సరఫరా తగ్గడం, శిశువు గుండెపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్కానింగ్‌లో గుర్తించామన్నారు. గర్భిణీ ఇష్టం మేరకు కోరియాంజియోమా అనే కణతిని అంజియో ఎంబోలైజేషన్ అనే పద్ధతిలో అత్యంత సమర్థవంతంగా పనిచేసి ఈ నెల 5వ తేదీన ప్రసవం చేసినట్లు తెలిపారు. శిశువు 2.75 కేజీలతో ఆరోగ్యంగా ఉందని, ఈ తరహా చికిత్సను విజయవంతం పూర్తి చేసినట్లు డాక్టర్ శిరీషరెడ్డి వెల్లడించారు.

భీమునిపాదంలో జల సవ్వడి

పెరుగుతున్న పర్యాటకుల తాకిడి
కనువిందు చేస్తున్న జలపాతం



గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 6 : గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో పచ్చని ప్రకృతినడుమ నిరంతరం జలధారతో అలరిస్తున్న భీమునిపాదం జలపాతం 70 అడుగులపై నుంచి జాలువారుతున్న వాటర్ పాల్స్‌ను చూసి పర్యాటకులు అబ్బురపోతున్నారు. శనివారం కురిసిన వర్షానికి భీమునిపాదంలో పర్యాటకుల సందడి పెరిగింది. రోజురోజుకు పర్యాటకుల సందడితో రద్దీగా మారుతుంది. ఆకాశంలో విరిసిన హరివిల్లు, మేఘాలను మోసుకువస్తున్నట్లు.. రాళ్లమీద నుంచి దూదిపింజెలు లోయలోకి దూకుతున్నట్లు 70 అడుగులపై నుంచి మంచు తెరలను తలపిస్తూ నీటి ధారాలు పడుతుంటే చూసే కన్నులకు ఎంతో హాయి... ఆకుపచ్చని ప్రకృతిలో గలగల పారే సెలయేరు ఒక్కసారిగా మాయమై గుట్టలమీది నుంచి కిందికి జాలువారుతుంటే మనస్సు పులకరిస్తుంది. ఈ రమణీయ దృశ్యాలకు నెలవు శోభిలిల్లే సోయగాలులకు నెలవు భీమునిపాదం. ఈ వర్షకాలంలో పచ్చపచ్చని ప్రకృతిలో గలగల పారేటి సెలయేటి మధ్య సేద తీరుదాం రండి అంటూ భీమునిపాదం జలపాతం పిలుస్తోంది.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

బచ్చన్నపేట, జూలై 6: మండలంలోని పోచన్నపేట గ్రామంలో ఆరు బయట ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. నిడిగొండ అశోక్ ఐదేళ్ల కుమారుడు సాయి శనివారం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు ఒక్కసారి మీదపడి దాడి చేసింది. ఇరుగుపొరుగువారు రాళ్లు, కర్రలతో బెదిరించగా పారిపోయాయి. ఆసమయంలో ఎవరూ లేకుంటే బాలుడి ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా గ్రామంలో వీధి వీధికి కుక్కల గుంపులు ఎక్కువయ్యాయని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గాయపడిన సాయి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ కల్చరల్, జూలై 6: జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాలలో ఈ నెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జనగామ విద్యుత్ శాఖ ఏఈ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జనగామ మునిసిపాలిటీ పరిధి బాలాజీనగర్, రవళి నర్సింగ్ హోం, ఏకశిల డిగ్రీ కళాశాల, కెనరాబ్యాంక్, నేచురల్ ఆయిల్ కంపెనీ, జీఎంఆర్ గార్డెన్స్, సెయింట్ మేరీస్ స్కూల్, సాన్ మారియా స్కూల్, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. నూతన స్తంభాలు నిలబెట్టడం కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూలై 6: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ మహిళా కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఎన్.వీ.ఎన్.చారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఈ కళాశాలను జనగామ మండలం పెంబర్తిలో నిర్వహిస్తున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందగోరు విద్యార్థులు ఈ నెల 9వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. బీఎస్సీ లో బీజెడ్‌సీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంపీసీ, బీకామ్(బీఏ), బీఏ(ఈపీహెచ్) కోర్సులలో అర్హతలను, సీట్ల లభ్యతను బట్టి అడ్మిషన్లు ఇస్తామన్నారు. వివరాలకు 98666 10429 నంబరులో సంప్రదించాలన్నారు.

8న జగన్నాథ స్వామి రథయాత్ర

జనగామ కల్చరల్, జూలై 6: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జనగామ చౌరస్తాలో 3.30 గంటలకు రథయాత్ర ప్రారంభమవుతుందని, సాయంత్రం 7.30 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకుని రథయాత్ర ముగుస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథయాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎంపీ కావ్య


బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎంపీ కావ్య

జఫర్‌గడ్, జూలై 6: మండలంలోని కూనూరుకు చెందిన పోతోజు రేవతమ్మ అనే నిరుపేద మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎంపీ కడియం కావ్య ఆమెను ఆదుకున్నారు. చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా రూ.1.60 లక్షలు మంజూరు చేయించి సంబంధిత పత్రాన్ని బాధిత కుటుంబీకులకు హన్మకొండలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ధనుంజయ్ గౌడ్, కాటం రాజిరెడ్డి పాల్గొన్నారు.


జనగామలో నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య


పాలకుర్తిలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బచ్చన్నపేటలో జగ్జీవన్‌రాం చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

జనగామ కల్చరల్, జూలై 6: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు జిల్లాలో ఘన నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర అమోఘమైందన్నారు. ఓటమి ఎరుగని ధీరునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ మాదిగ, సందెన రవీందర్, బొట్ల మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి అధ్యర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు వేరైనప్పటికీ మనజాతి అంతా ఒకటేనని తెలిపారు. మన జాతికి సమస్య వస్తే అందరం ఒక తాటిపైకి వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జనసేనా పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గాదె పృథ్వీ, బీఎస్పీ పార్టీ నియోజకవర్గ నాయకుడు ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోవిందు అశోక్, బీఆర్ఎస్ నాయకుడు మాచర్ల గణేష్, కాంగ్రెస్ నాయకులు గుర్రం యాదగిరి, చింత ఎల్లయ్య, తాటికొండ సురేష్, గుర్రం శంకర్, దేవయ్య, చిట్టిబాబు, బాబు, మారపల్లి ప్రసాద్, అశోక్, మల్లేషం పాల్గొన్నారు.

పాలకుర్తి: భారత ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ ఏఐసీసీ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా పనిచేసి దేశఖ్యాతిని పెంచారని అన్నారు. కార్యక్రమంలో చిలువేరు కృష్ణమూర్తి, బిర్రు సోమేశ్వర్, ఐలయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

బచ్చన్న పేట: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు, ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘ సంస్కర్తగా, భారత పార్లమెంట్‌లో 40 ఏళ్లు వివిధ పదవులు నిర్వహించాడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల నర్సింగరావు, మల్యాల బాల్‌నర్సయ్య, పాకాల కుమారస్వామి, అంజయ్య, కర్రె శ్రీనివాస్, అనిల్, రాజు, అఖిల్, జిల్లా సందీప్ పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి ప్రభాకర్ తదితరులు జగ్జీవన్‌రాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతి, దేశ ప్రగతి కోసం జగ్జీవన్ రాం చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సంఘ సంస్కర్తగా, సమర యోధుడిగా విశేష సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు టి.రాజెందర్, మాజీ ఎంపీటీసీ టి.ఎల్లయ్య, నాయకులు యాకయ్య, దుర్గాసింగ్, దుద్దుల చంద్రమౌళి, గుడ్డేటి ఎల్లయ్య, తాటికాయల యాకయ్య, బొడ్డు లక్ష్మీనర్సు, పులి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

- మొక్కలు నాటి నివాళి అర్పించిన బీజేపీ నాయకులు

జఫర్‌గడ్, జూలై 6 : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉప్పుగల్లు, కూనూరు, రఘునాథ్‌పల్లి, తమ్మడపల్లి(ఐ), తిమ్మంపేట, సూరారం, సాగరం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్థుల సమక్షంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, సంక్షేమం కోసం శ్యాంప్రసాద్ నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని అంటూ ఏక్ భారత్ అనే నినాదంతో అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కె.నాగేశ్, నాయకులు గాదెపాక శ్వేత, ఇల్లందుల సారయ్య, బుచ్చయ్య, పోతోజు ఎల్లాచారి, చిరబోయిన కవిత, హరిత, మహేశ్ గౌడ్, పల్లె సంతోష్‌రెడ్డి, అన్నెపు రమేశ్, కోతి భాస్కర్, మోడెం అరవింద్, చీకటి శ్రీనివాస్, పిట్ట రాజు, తదితరులు పాల్గొన్నారు.


జఫర్‌గడ్ మండలం కూనూరులో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి: దేశభక్తిని, జాతీయ వాదాన్ని యువత గుండెల్లో రగిలించిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ గొప్ప సంస్కర్త అని బీజేపీ నాయకులు కొనియాడారు. శనివారం మండల కేంద్రంలోని పంచగుళ్ల సమీపంలోని కోనేరు వద్ద శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ యువతలో దేశభక్తిని పెంపొందించడంలో ముందు వరుసలో ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పెనుగొండ సోమేశ్వర్, పబ్బ సంతోష్ వేల్పుల దేవరాజ్, ఈర్ల రాజు, సురేష్ రాజు, మహేష్, మంచినీళ్ల ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం చిలుపూర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన గొప్ప మహనీయునిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు పెండ్యాల దిలీప్, ప్రధాన కార్యదర్శి ఎలిశాల శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు తోట రంజిత్, సతీష్, గాదె లింగయ్య, సాదం రామరాజు, జగన్, సంపత్ పాల్గొన్నారు.

మహిళలపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

జనగామ, జూలై 6(ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణం ధర్మకంచ ఏరియాలో శనివారం ఓ వ్యక్తి మహిళలపై దాడి చేశాడు. కాలినడకన వెళ్లే వృద్ధ మహిళలను పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా అడ్డుకునే వారిని సైతం బెదిరించాడు. దీంతో కాలనీవాసులు 100కు డయల్ చేయడంతో పోలీసులు చేరుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ సంజయనగర్‌కు చెందిన వృద్ధురాలు కాగితాల లక్ష్మి పాలు అమ్ముకునేందుకు అక్కడకు వచ్చింది. రోడ్డుపై నిలుచున్న సదరు వ్యక్తి ఆమెపై దాడి చేస్తూ తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన స్థానికులు వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ మరింత రెచ్చిపోయాడు. పక్కనే డబ్బా దుకాణం నడుపుకుంటున్న పులి ప్రమీల షాపులోకి వచ్చి సరుకులను చెల్లా చెదురు చేసి కొట్టేందుకు ప్రయత్నించాడు. ఆమె ధైర్యం చేసి అడ్డుకోవడం, స్థానికుల బలం పెరగడంతో వ్యక్తి పారిపోయి దగ్గరలో ఉన్న మరో కాలనీకి వెళ్లాడు. అక్కడ సైతం ఇద్దరిపై దాడి చేయగా పెద్ద ఎత్తున గుమిగూడిన జనం వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.


వృద్ధురాలిని విచారిస్తున్న పోలీసులు

రేగులలో అభివృద్ధిపై సమీక్ష


ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల, జూలై 6 : మండలంలోని రేగుల, రేగుల తండాలో కాంగ్రెస్ నాయకులు గ్రామాభివృద్ధిపై సమీక్షించారు. గ్రామంలోని వీధులన్నీ తిరిగి అభివృద్ధి పనులను, సమస్యలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామపెద్దల అభిప్రాయాలను తీసుకుని నివేదిక తయారు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్ రెడ్డి, రాజేష్ నాయక్, యాకేష్ యాదవ్, భిక్షపతి నాయక్, బి.శివకుమార్, అంజయ్య పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాలేదు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 6: డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి భూమి అన్యాక్రాంతం కాలేదని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. అన్యాక్రాంతం అవుతోందని ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శనివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు 641లో 129 ఎకరాల మేర భూమి ఉందని, కొందరు వ్యక్తులు దేవాలయ భూమి పక్క సర్వే నెంబరు 642లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఆలయ భూమి 641లో పోజిషన్ తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దేవాలయ భూముల జోలికి వచ్చేవారు ఎంతటివారైనా సహించేది లేదన్నారు.


తిరుమలనాథ స్వామి ఆలయ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందిస్తున్న రజక సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 6: రజక సంఘం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణకు రావాలని కోరుతూ శనివారం డివిజన్ కేంద్రానికి చెందిన రజక సంఘం నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆహ్వానపత్రికను అందించారు. నాయకుల ఆహ్వానం మేరకు ఈ నెల 11న నిర్వహిస్తున్న ఆవిష్కరణోత్సవానికి వస్తానని నాయకులకు కడియం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కడియంను కలిసిన వారిలో నాయకులు పొన్న శ్రీనివాస్, భిక్షపతి, రవి, మధుకుమార్, సత్యనారాయణ, రమేష్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

జనగామ కల్చరల్, జూలై 6: మండలంలోని గానుగుపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం ప్రధానోపాధ్యాయుడు వంగాల రాజేందర్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కె.సోమయ్య, కె.రవీందర్‌రెడ్డి, కె.రమేష్, డి.గోపాలకృష్ణ, జె.అంజిరెడ్డి, ఎ.రవీందర్, ఎం.రవికుమార్, బి.లలిత, ఎస్.ఐజాక్, టి.శ్రీనివాసులు బదిలీపై వెళుతుండగా పూర్వ విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. వీడ్కోలు సమావేశంలో గ్రామస్థులు ఎడమ అయిలయ్య, కక్కర్ల శ్రీనివాస్, రెడ్డెబోయిన కనకయ్య, దడిగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో మలమూత్రాల కంపు

లింగాలఘణపురం, జూలై 6: వర్షాకాలం సీజన్ వచ్చేసింది.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఊరూరా డంకా భజాయించి పారిశుధ్యంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు తమ కార్యాలయంలో ముక్కుపుటాలు అదిరేలా వస్తున్న కంపును మాత్రం పట్టించుకోవడం లేదు. లింగాలఘణపురం మండల పరిషత్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్, ఈజీఎస్ సెక్షన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్యాలయాలు కొనసాగుతున్న మొదటి అంతస్తులో మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేసే దిక్కులేక నెలల తరబడి కంపు కొడుతున్నాయి. దీంతో ఫస్ట్ ఫ్లోర్‌లో పనిచేసే సిబ్బంది ముక్కులు మూసుకుంటూ పనిచేస్తున్నారు. ఇటీవల ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమానికి వందలాది మంది మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. అయితే వచ్చీ రాగానే మండల ప్రజలకు మూత్రశాలల నుంచి వచ్చే కంపు వాసన స్వాగతం పలకడం గమనార్హం. పైఅంతస్థుల్లో పనిచేసే సిబ్బంది మరుగుదొడ్లు, మూత్రశాలల నుంచి వచ్చే దుర్గంధాన్ని తట్టుకోలేక మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా మండల పరిషత్ కార్యాలయం మొదటి అంతస్తులో వచ్చే మూత్రశాలల కంపును నివారించేందుకు ఎంపీడీవో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


లింగాలఘణపురం మండల పరిషత్ కార్యాలయంలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

ఆలయ అభివృద్ధికి విరాళం

నర్మెట, జూలై 6: మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వనాథ శివాలయ అభివృద్ధికి దాత బత్తుల కరుణాకర్ రూ.50 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు జంగిటి అంజయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్, కాశెట్టి బాలు, మూల చందర్, గోపగోని నరేష్, దొండకాయ కుమార్, కల్లూరి గణేష్, కొండం బాలయ్య, ఎర్రబోయిన మహేందర్, బిర్రు రాజేష్, కల్లూరి సిద్దయ్య, బండి రాజు, ప్రజ్ఞాపురం ఆంజనేయులు, ప్రజ్ఞాపురం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్

నర్మెట, జూలై 6: ఎంపీటీసీల పదవీకాలం బుధవారంతో ముగియడంతో మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఇంటర్‌మీడియల్ విద్యాధికారి శాగంటి శ్రీనివాస్ శనివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.అరవింద్ చౌదరి, సిబ్బంది ఎస్.అనూరాధ, రఘు, కార్తీక్ తదితరులు ఆయనను సత్కరించారు.

పాలకుర్తి తహసీల్దార్‌గా శ్రీనివాస్

పాలకుర్తి, జూలై 6 : పాలకుర్తి నూతన తహసీల్దార్‌గా పొట్టబత్తుల శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ వెంకటేశం, గ్రేటర్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో జనగామ జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలుంటే నేరుగా కార్యాలయానికి రావాలని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

తెలంగాణ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా ప్రవీణ్

కొడకండ్ల, జూలై 6: మండలకేంద్రానికి చెందిన కళాకారుడు జవ్వాజి ప్రవీణ్ తెలంగాణా కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణా కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరికంటి కిరణ్‌కుమార్ ప్రవీణ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమంలో రాష్ట్రమంతా తిరిగి ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచానని తెలిపారు. తన కళను , కష్టాన్ని గుర్తించి తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

జనగామ కల్చరల్, జూలై 6: స్కూల్ టీచర్ల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. పాఠశాల సెక్రటరీ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆర్థికంగా సహకరించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభ కిరణ్, కొత్తూరు వాసు, జైన శశికళ, ఎర్రం రాజ్యలక్ష్మి, లగిశెట్టి విజయ్, పీఈటీ నాగరాజు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు

జనగామ రూరల్, జూలై 6: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం జిల్లా అధికారి డాక్టర్ ఎస్.ఎల్ మనోహర్ ఆధ్వర్యంలో కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే వాటిని జూనోటిక్ వ్యాధులు అంటారని వివరించారు. యేటా కుక్కలకు ఈ టీకాలను ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు.

అంగడి సమస్యలపై దృష్టి సారించాలి


చిలుపూర్ గుట్ట అంగడిలో మాట్లాడుతున్న దేవస్థానం మాజీ చైర్మన్ మూల నాగరాజు

చిలుపూర్, జూలై 6 : చిలుపూర్ గుట్ట వారసంత (అంగడి)లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో దేవాదాయ శాఖ అధికారులు విఫలమయ్యారని దేవస్థానం మాజీ చైర్మన్ మూల నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం స్థానికులతో కలిసి అంగడిలో బురదమయంగా మారిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యేటా లక్షలాది రూపాయల ఆదాయం సమకూర్చే వార సంతపై దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలని, చెత్త చెదారం, వాటర్ ట్యాంక్ (సిస్టర్న్) చుట్టూ చేరిన మురుగునీరు తొలగించాలని, వరదనీటితో బురదమయంగా మారిన ప్రదేశాల్లో మొరం పోయించాలని సూచించారు. అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తౌటి సునీల్, పంతం రాజుగౌడ్, గొల్లపల్లి సారయ్య, బాల్నె నాగరాజు, సాంబరాజు, చంద్రగిరి జమ్మయ్య, తాళ్ళపల్లి బుచ్చయ్య, కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఇల్లందుల యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

చిలుపూర్, జూలై 6 : శ్రీపతిపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 70లో ఉన్న 46.21 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ పార్టీ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపెల్లి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్ విమలకు వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీపతిపల్లిలో ఉన్న ప్రభుత్వ భూములను నిరుపేద కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఐదేళ్ళుగా పోరాటం చేస్తున్నామని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనగిరి కుమారస్వామి, సముద్రాల రాజు, పిట్టల కుమారస్వామి, ఆవుల గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి తహసీల్దార్ విమలకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

'భూసార పరీక్షలు చేయించుకోవాలి'

నర్మెట, జూలై 6: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి వల్ల భూమి లోని లోపాలు తెలుసుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి గోనెల కన్నయ్య తెలిపారు. శనివారం ఆయన వెల్దండ, అమ్మాపురం, కన్నెబోయిన గూడెం గ్రామాలలో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమికి కావాల్సిన ఎరువులను మాత్రమే వాడి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. హరిత, పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటివి వేసి భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. వానాకాలం సీజన్‌కు పచ్చిరొట్ట ఎరువులు వాడాలన్నారు.

స్థలం కేటాయించాలంటూ వినతి

తరిగొప్పుల, జూలై 6: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రాథమిక సహకార సంఘానికి స్థలం కేటాయించాలని కోరుతూ సొసైటీ మాజీ చైర్మన్ అర్జుల సుధాకర్ రెడ్డి శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు మెమోరాండం అందజేశారు. మండలం ఏర్పాటయ్యి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు లేవని, అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అధికారులతోపాటు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇప్పటికైనా దృష్టిసారించి ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాన్ని కెటాయించి వెంటనే నిధులు మంజూరీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'మద్దతు ధర కోసం చట్టం చేయాలి'


జఫర్‌గడ్‌లో తహసిల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం రాష్ట్ర నేత రాపర్తి సోమయ్య

జఫర్‌గడ్, జూలై 6: పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు చట్టాన్ని రూపొందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య కేంద్ర సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఇందుకోసం సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జఫర్‌గడ్‌లో తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ సాగురంగంలో నానాటికీ పెట్టుబడి పెరుగుతోందని, దిగుబడులు తగ్గుతున్నాయని, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయంలో కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రం ఇటీవల ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు ప్రయోజనం చేకూర్చేలా లేవని, వాటిని సవరించాలని కోరారు. వివిధ పంటలతో పాటు కూరగాయలు, పండ్లకు కూడా ధరలను నిర్ణయించి చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసిల్దార్ అంబటి ఆంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడిక కొమురయ్య, పినింటి సమ్మయ్య, నీరటి కొమురయ్య, పినింటి సత్తయ్య, ఎర్ర రవి, మంచాల బుచ్చయ్య, రాజలింగం, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.